నేడు పంచాయతీ ఎన్నికలపై రాజకీయ పార్టీలతో సమావేశం : ఎంపీడీవో

ఉట్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలపై రాజకీయ పార్టీలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉట్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండల పార్టీల అధ్యక్షులు సమావేశానికి హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.



ఫ్లకార్డుతో పింఛన్‌దారుడి నిరసన

హామీలు అమలు కాలేదు.. విజయోత్సవాలా?

● పంటపొలాల్లో ఫ్లకార్డులతో ముక్రా(కె) గ్రామస్థుల వినూత్న నిరసన

ఇచ్చోడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా రాలేదు.. రైతు పండగ చేసేదేలా.. రూ.2లక్షల పైబడి ఉన్న రైతులకు రుణమాఫీ పూర్తికానప్పుడు

(మిగతా 6వ పేజీలో...)




చిరుత పాద ముద్ర

చిరుత సంచరిస్తోంది.. జర జాగ్రత్త!

● బోథ్ మండలం ధన్నూర్ అటవీ ప్రాంతంలో పాద ముద్రల గుర్తింపు


● ఒంటరిగా పంటపొలాలకు వెళ్లొద్దు : డిప్యూటీ రేంజ్ అధికారి

వివరాలు 7వ పేజీలో...



పల్లెపోరుకు.. కసరత్తు

- జిల్లాలో 473 పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు
- సర్పంచ్, వార్డు రిజర్వేషన్ల కోసం ఎదురుచూపులు
- పల్లె రాజకీయాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్న నేతలు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సై అంటున్న యువత
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 4.47 లక్షలకు పైగా ఓటర్లు



జిల్లాలోని.. 18 మండలాలకు గాను 17 మండలాల పరిధిలో 473 పంచాయతీలు, 3870 వార్డులకు గాను ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 4లక్షల 47వేల 135 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో పురుషులు 2లక్షల 18వేల 683 మంది కాగా మహిళలు 2లక్షల 28వేల 436 మంది మరో 16 మంది ఇతరులు ఉన్నారు. మొదట పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి.. ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేం దుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదిలాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ జాబితాను సిద్ధం చేసిన అధికారులు ఇటీవలే పోలింగ్ స్టేషన్లను గుర్తించి జాబితాను విడుదల చేశారు. అలాగే మండలాల వారీగా.. జిల్లాస్థాయిలోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 17న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని అనుకూలంగా జరిగితే జనవరి 14న నోటిఫికేషన్ విడుదలయ్యే అవ కాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి రెండవ వారంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పంచాయతీల పదవీ కాలం ముగిసి యేడాదికి దగ్గర పడడంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లాలోని 18మండలాలకు గాను 17 మండలాల పరిధిలో 473 పంచాయతీలు, 3870 వార్డులకు గాను ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 4లక్షల 47వేల 135 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో పురుషులు 2లక్షల 18వేల 683 మంది కాగా మహిళలు 2లక్షల 28వేల 436 మంది మరో 16 మంది ఇతరులు ఉన్నారు. మొదట పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి.. ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

రిజర్వేషన్లపై ఆసక్తి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యంగా రిజర్వేషన్ల పైననే సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది. గతంలో మాదిరిగానే యథావిధిగా రిజర్వేషన్లు ఉంటాయా? లేదా? ఏమైనా మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2018 ఎన్నికల్లో పదేళ్ల పాటు వరుసగా ఒకే రిజర్వేషన్ ఉంటుందని గత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఈసారి ప్రభుత్వం మారడంతో రిజర్వేషన్లపై పలు సందేహాలు వినిపిస్తున్నాయి. యథావిధిగా అవే రిజర్వేషన్లు ఉంటే ఎక్కువగా తాజా మాజీ సర్పంచ్‌లే మళ్లీ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉంటుంది. కానీ రిజర్వేషన్లు మారితే కొత్త వారికి అవకాశం దక్కుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లపై గ్రామాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరికి వారే రిజర్వేషన్లపై ధీమాగా కనిపిస్తున్నారు. కొందరు మాజీ సర్పంచ్‌లైతే రిజర్వేషన్ కలిసి వస్తే ఒకే.. లేదంటే తమ దగ్గరి అనుచరులను ఎన్నికల బరిలో దింపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తానికి రిజర్వేషన్లు ఖరారైతేనే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

రాజకీయ పార్టీల ముందుచూపు

త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ముందుచూపుతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ముఖ్య నేతల సమావేశాలను నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే వారంతా ముఖ్య నేతల చుట్టూ.. తిరుగుతు ఈసారి అవకాశం కల్పించాలంటూ హామీలు తీసుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో కుల, జనాభాల వారీగా లెక్కలు తీస్తూ ఈసారి ఎవరిని బరిలోకి దింపితే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైన అభ్యర్థులను మళ్లీ బరిలోకి దింపాలని భావిస్తున్నారు. ఎందుకంటే సానుభూతితో గెలిచే అవకాశం ఎక్కువగా ఉంటుందని చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులు లేకపోయినా.. పార్టీల వారీగా అభ్యర్థులకు మద్దతునిచ్చి గెలిపించుకునేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు.

స్థానిక పోరుపై యువత ఆసక్తి

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, పరిస్థితులు

(మిగతా 6వ పేజీలో...)

గ్రూపు-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● అధికారులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 15, 16న నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్స్, ఇన్విజిలెటర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15, 16వ తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించేందుకు మొత్తం 29 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలెటర్లు, శాఖపరమైన అధికారుల, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, పరీక్ష పత్రాల బందోబస్తు, పరీక్షల కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఏర్పాటు, జిల్లాలో గ్రూప్ -2 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. స్రైబ్ సెంటర్ ప్రభుత్వ బాలికల హైస్కూల్ భుక్తాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు అలాగే 16న ఉదయం 10గంటల నుంచి 12.30, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు నాలుగు దఫాలుగా పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రంలోకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలన్నారు. మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో పరీక్ష కేంద్రాలకు రావొద్దని, అలాగే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. పరీక్షల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అందరు ఐడీ కార్డులు ఉపయోగించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఎస్పీ జీవన్‌రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ జగ్రాం అంతర్బెడి, తహసీల్దార్లు, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేక అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఘనంగా గోండి విక్షనరీ దినోత్సవం

ఉట్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రాజ్ గోండుసేవా సమితి భవనం గుస్సాడి గుట్టలో బోలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోండి విక్షనరీ ఆవిర్భావ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోలిచేతో ఫౌండేషన్ బోర్డు మెంబర్స్ సిడాం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో 30లక్షలకు పైగా మాట్లాడే గోండి భాషలో విక్షనరీని రూపొందించడం చాలా గొప్ప విషయమన్నారు. దేశంలోని గిరిజన భాషలకు సరైన రక్షణ కల్పించి వాటిని కాపాడుకునేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అనంతరం సభ్యులు ఆత్రం మోతిరామ్, సిడాం వరప్రసాద్, కోలాం విద్యార్థి సంఘం సభ్యులు ఆత్రం జ్యోతిరాం, మడావి రవి పాల్గొని కేక్ కట్ చేశారు.

శిథిలావస్థ దుకాణాలు కూల్చివేత

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీచౌక్‌లోని పెద్ద కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్‌కు సంబంధించిన షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో బుధవారం మున్సిపల్ అధికారులు జేసీబీ సాయంతో వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవీఎన్ రాజు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్లోని షాపులు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకున్నాయని, అంతేకాకుండా ప్రమాదకరంగా మారాయని ఆయన పేర్కొన్నారు. దీంతో ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా దుకాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. ఇందులో వన్ టౌన్ ఎస్సై అశోక్‌తో పాటు సిబ్బంది, తదితరులు ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో ప్రణీత

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు క్రీడాలపై దృష్టి సారించాలని డీఈవో ప్రణీత అన్నారు. సీఎం కప్ అర్బన్ పోటీలను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. దీనికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో ప్రణిత మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. పట్టణ స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఎంఈవో సోమయ్య, మున్సిపల్ ఆర్ఐ వెంకటేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

● సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

నార్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లులలో పత్తి అమ్మడానికి వచ్చినప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం మండలంలో ఆకస్మిక పర్యటన చేశారు. ఎన్ఎస్ఆర్ ఫార్మర్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో తనిఖీ చేశారు. పత్తి తేమపై సిబ్బందిని, సీసీఐ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దు, వారికి ఎలాంటి అన్యాయం చేసిన సహించేది లేదని హెచ్చరించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రాజలింగుకు సూచించారు. అనంతరం పశువైద్యశాల ఆసుపత్రి తనిఖీ చేశారు. డాక్టర్లు లేకపోవడం, రికార్డులు సరిగా లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి పని తీరుపై మండిపడ్డారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీలో 1970 కంటే ముందు ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో ఆర్ఐ సురేందర్, చందు, తదితరులున్నారు.

సీఎం కప్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

నార్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సీఎం కప్ పోటీలు పకడ్బందీగా నిర్వహించేలా అందరూ సహకరించాలని ఎంపీడీవో జవార్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయి సీఎం కప్ 2024 పోటీల్లో అర్హులైన ఆటగాళ్లు పాల్గొన్న సందర్భంగా అందరూ సహకరించాలని ఈ పోటీలు మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయాలి'

ఉట్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలోని అనంతపూర్‌లో నిర్వహించనున్న పదవ మహాసభలను విజయవంతం చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆత్రంభుజంగరావు అన్నారు. బుధవారం గుడ్మూరు మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో పదవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజాలో ఉండే ప్రతీ ఒక్కరిని ఊచకోత కోయాని దే అగ్రరాజ్యాల రక్తదానం చేయడం లేదని అన్నారు. ప్రజలకు రాజ్యాంగహక్కులు కల్పించాలని భావనతోని నిర్వహిస్తున్న మహాసభలకు ప్రతీఒక్కరు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బానోతు రామారావు, నేతావత్‌రాందాస్,కొమ్ము విజయ్, ప్రజ్ఞాశీల్, జాడి వెంకటేశ్, జంగదేవ్, దీపక్, రాములు, సుజిత్‌లు పాల్గొన్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

● భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



● ఉదయం వేళ కూలీల పాట్లు

ఆదిలాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత కనిపిస్తుంది. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 27.8 డిగ్రీలు కాగా, కనిష్ఠంగా 9.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 8.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆదిలాబాద్ రూరల్‌లో 9.1 డిగ్రీలు, తలమడుగులో 9.4, బేలలో 9.5, నేరడిగొండలో 9.6, మావలలో 9.7, జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 15 కనిష్ఠ డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు కనిపించక పోయినా.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో మారుమూల ప్రాంతాల ప్రజలు తీవ్రమైన చలితో వణికి పోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండానే చలి తీవ్రత కనిపిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాలను వదిలి ఆరుబయటనే ఎండలో కొద్దిసేపు సేద తీరుతున్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆరుబయట ఎండలోనే కూర్చొబెడుతు పాఠాలను బోధిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, రైతు కూలీలు, మున్సిపల్ కార్మికులు వసతి గృహాల్లో ఉంటు చదువుకుంటున్న విద్యార్థులు చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పగటిపూటే చలి మంటలు

తాంసి(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుంచి తాంసి మండలంలో చలి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుంది. దీంతో దినంలోనూ చలిమంటలు కాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం పూట చలి మొదలై ఉదయం 11 గంటల వరకు కూడా చలి తీవ్రత ఉండటంతో చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటి పడిందంటే బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు పాఠశాలకు పోవాలంటేనే గజగజ వణుకుతూ వెళుతున్నారు. గత సంవత్సరంతో పోల్చిస్తే ఈ యేడు నెలరోజుల ముందుగానే చలి తీవ్రత పెరిగిందని పలువురు అంటున్నారు. ప్రతీయేడు డిసెంబరు రెండవ వారం, లేదా మూడవ వారం నుంచి ప్రారంభం అయ్యేవని.. కానీ ఈయేడు నవంబరు మొదటి నుంచే మొదలయ్యాయని అంటున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత ఇంకా ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. మంచం దిగి కాలు కింద పెట్టడం లేదంటున్నారు.



ఆదిలాబాద్ పట్టణంలో చలి మంటలు వేసుకుంటున్న స్థానికులు



తాంసిలో పగటిపూట చలి మంటలు కాగుతున్న చిన్నారులు



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డులు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి హెచ్‌ఎం ప్రకాష్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, తదితరులున్నారు.

బుద్దికొండ వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటు

నేరడిగొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్ధికొండ శివారులో గల శబరిమాత ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఆడే గజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి ఆడే గజేందర్‌ని ఆలయ కమిటీ సభ్యులు హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని కోరగా.. వెంటనే స్పందించి బుధవారం హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు షేక్ మౌలానా, మోహన్‌రెడ్డి, భక్తులు, గ్రామస్థులున్నారు.

గాదిగూడలో టీచర్లను నియమించండి

నార్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంత గాదిగూడ మండలంలోని కొన్ని పాఠశాలలో ఇప్పటి వరకు ఉపాధ్యాయులు లేక విద్యార్థిని విద్యార్థుల విద్యకు పునాదిలోనే నష్టపోతున్నారు ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు ఐటీడీఏ పీఓకు బుధవారం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఏవీఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌పెందూర్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి చేయకూడదని పేర్కొన్నారు. గిరి బిడ్డలను విద్యకు దూరం చేయడం అనేది చట్టానికి విరుద్ధమని అభిప్రాయపడ్డాడు. ఎట్టి పరిస్థితుల్లో మండలంలో ఏ ఏ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారు. వారిని నియమించి వెంటనే గిరి విద్యార్థులకు విద్యార్థి అందించేలా ఐటీడీ సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. వారి వెంట నాయకుడు కుంరం కోటేశ్వరరావు, మరప గంగారాం పాల్గొన్నారు.

రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు : డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు అరుదైన ఆపరేషన్లను చేస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఇటీవల న్యూరోకు సంబంధించి రెండు ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేయడంతో బుధవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్‌లో పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రైవేట్‌లో పెద్ద ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్లను వైద్యులు ఇక్కడ చేస్తున్నారన్నారు. న్యూరోకు సంబంధించి డాక్టర్ విజయ్‌మోహన్ రెండు ఆపరేషన్లు చేశారని, రోగులు ప్రస్తుతం బాగున్నారని తెలిపారు. రిమ్స్‌కు వచ్చే రోగి సహాయకులు కొన్ని సూచనలు పాటించాల్సి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

● భీంపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

భీంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ అలం అన్నారు. ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం భీంపూర్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మహారాష్ట్ర నుంచి ఎలాంటి మత్తు పదార్థాలు జిల్లాకు రానివ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో పలు రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రత సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్పీతో జిల్లా డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్‌ఐలు పురుషోత్తం, మహ్మద్ ఖలీం, ఏఎస్‌ఐ స్వామి, గోకుల్ జాదవ్, ముంతాజ్ ఖాన్, కానిస్టేబుల్స్ గేడెం రమేష్, కీరు జాదవ్, రమేష్, తదితరులు ఉన్నారు.



భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

రెండు రోజులుగా అందని భగీరథ నీరు

బోథ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహదుగూడ గ్రామపంచాయతీ పరిధిలో పలు గూడేలకు రెండు రోజుల నుండి మిషన్ భగీరథ నీరు రావడంలేదని గ్రామస్తులు తెలిపారు. నీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల మీరు రాకుండా పోయిందని ఆయా గ్రామాల గిరిజనులు వాపోతున్నారు. అంతేగాక మహదుగూడలో ఉన్న బోరుబావులు సైతం పనిచేయడం లేదని గ్రామస్థులు వాపోయారు.

రైతు అవసరాల పనులకు తీర్మానం

బోథ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో రైతుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలని మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం తీర్మానించింది బుధవారం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు గంగారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో మార్కెట్ కమిటీ చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ గదులను నిర్మించాలని అంతేగాక వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు కలవకుండా పంటను కాపాడుకునేందుకు షెడ్డును నిర్మించుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కార్యదర్శి విట్టల్‌తో పాటు వైస్ చైర్మన్ వసంత్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు

సిరికొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల రాయిగూడలో అట్టహసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర సరస్వతి కోటేశ్వర్ హజరై పోటీలను ప్రారంభించారు. ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కిసాన్ చౌహన్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, ఉపాద్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ముగిసిన సీఎం కప్ పోటీలు

తాంసి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, ఎంపీడీవో మోహన్ రెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల శ్రీనివాస్, అశ్వత్, లీల, ఎంపీవో లింగయ్య, జూనియర్ అసిస్టెంట్ దారవేణి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

14, 15న మానవ హక్కుల వేదిక సభలు

ఇంద్రవెల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సోన్ కాంబ్లే గోపినాథ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు

బోథ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతా జయతిని పురస్కరించుకొని మండలంలోని పలు శబరిమాత ఆశ్రమాలలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గీతా జయంతి రోజున శబరిమాత జయంతి కావడంతో బోథ్, దన్నూర్, కుచలాపూర్, కనుగొట్ట ఆశ్రమాలలో వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

'జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు మీడియా ప్రతినిధులపై చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేసే మీడియాపై మోహన్‌బాబు దాడి చేయడం సరైంది కాదన్నారు. పోలీసులు ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

● 'జర్నలిస్టులపై దాడిని సహించేదిలేదు'

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడిని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ సినీనటుడు మోహన్‌బాబు విలేకరిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

● 'మీడియాపై దాడి అమానుషం'

బోథ్(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడం అమానుషమైన చర్య అని బోథ్ ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ప్రజా సమస్యలను బయటకు తీసుకువచ్చే మీడియాపైన మోహన్ బాబు దాడి చేయడం ఆయన వ్యక్తిత్వానికి సరికాదన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు ముఖానికి తెల్ల రిబన్ కట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై స్పందించాలన్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌పీ రాష్ట్ర అధికార ప్రనిధి పడాల రవీందర్, ఉద్యోగ నాయకులు వినోద్, ప్రకాష్, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

'పల్లెపోరు'కు కసరత్తు

(5వ పేజీ తరువాయి...)

కలిసి వస్తే పోటీకి సిద్ధమేనంటూ యువత ధీమా వ్యక్తం చేస్తోంది. త్వరలో జరుగనున్న ఎన్నికలపై యువతలో ఆసక్తి కనిపిస్తుంది. గత కొద్దిరోజులుగా గ్రామాల్లో పలురకాల సేవా కార్యక్రమాలు చేస్తూ ఓటర్లకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా కష్ట సుఖాలతో పాటు ప్రభుత్వ పథకాల మంజూరులోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. తాజా మాజీ సర్పంచ్‌ల వైఫల్యాలను ఎత్తిచూపుతూ ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి సేవ చేస్తామంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు వైరల్ చేస్తున్నారు. కొందరైతే సొంత ఎజెండాతో పలు రకాల హామీలు ఇస్తూ మద్దతును కూడగడుతున్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో వచ్చే ఎన్నికల్లో గెలుపు ఎవరిదన్నది అంచనాలు వేసుకుంటున్నారు. కులాల వారీగా అభ్యర్థులను బరిలోకి దింపాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల ను వదిలి పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఎందరో మంది యువతీ, యువకులు సిద్ధమవుతున్నారు.

'ఆరు గ్యారంటీలే అమలు కాలేదు..'

(5వ పేజీ తరువాయి...)

విజయోత్సవాలు జరిపేదేలా? అంటూ రైతులు పంటపొలంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ముక్రా(కె) గ్రామంలో రైతులు, యువకులు, వ్యవసాయ కూలీలు, పింఛన్‌దారులు ఆరు గ్యారంటీల అమలుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజులలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని చెప్పి ఏడాది కాలం పూర్తయిన హామీలు అమలు చేయకపోవడంతో ముక్రా(కె) రైతులు ఫ్లకార్డులతో వినూత్న నిరసన చేపట్టారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు గోవిందా.. గోవిందా అంటూ నినాదిస్తూ గ్రామస్థులంతా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్, గ్రామస్థులు ఆశోక్, దత్త, పరమేశ్వర్, ప్రలాద్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ముక్రా(కె) గ్రామస్థులు

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఉట్నూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ టీం (బి) రాష్ట్రీయ బాల స్వస్తి కార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హారిప్రియ డాక్టర్‌సంతోష్‌లు విద్యార్థులకు ఆరుగురు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.ఈ హెల్త్ చెకప్ కార్యక్రమం విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ధనరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు రాధా, ఏఎన్‌ఎం మీనాక్షి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చేరాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివినప్పుడే తాము అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారని సెక్టోరల్ అధికారి జె.నారాయణ అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల లాండసాంగ్వి సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భైంసాలో విజేత జట్లతో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్, మండల అధికారుల బృందం



క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం



ముథోల్‌లో విజేతలకు కప్ అందజేస్తున్న అధికారులు

నిర్మల్ జిల్లాలో ఉత్సాహభరితంగా సీఎం కప్ క్రీడలు

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరుగుతున్న మండల స్థాయి క్రీడల పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన క్రీడలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ వివిధ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ పేరిట క్రీడాపోటీలను నిర్వహిస్తోందని వెల్లడించారు. ఆటగాళ్ల క్రీడా స్ఫూర్తితో పోటీల్లో తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో సుభాష్, ఎంపీవో మహమ్మద్ మోజం హుస్సేన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

లోకేశ్వరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడ్‌చందా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీల్లో వివిధ గ్రామ పంచాయతీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఏపీవో సల్మాన్‌రాజ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ జిల్లాస్థాయికి ఎంపికయిన క్రీడాకారులను లోకేశ్వరం గ్రామ పంచాయతీ తరుపున పంచాయతీ సెక్రటరీ వినయ్, కారోబార్ లక్ష్మణ్ వీరికి ఘనంగా శాలువాతో సన్మానించారు.

ముగిసిన మండల స్థాయి..

ముథోల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత సీఎం క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన 108 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర కబడ్డీ పోటీలో తరోడా తండా మొదటిస్థానంలో, రెండవస్థానంలో విట్టోలి నిలువగా, బాలికల కబడ్డీ పోటీల్లో మొదటి స్థానంలో ఆష్ట, రెండవస్థానంలో ముథోల్ జీపీలు నిలిచాయి. వాలీబాల్‌లో మొదటిస్థానంలో ఎడ్‌బిడ్, ద్వితీయ స్థానంలో ముథోల్ జీపీలు, బాలికల విభాగంలో మొదటిస్థానంలో విట్టోలి తండా, ద్వితీయస్థానంలో ముథోల్, ఖోఖోలో బాలుర విభాగంలో మొదటి స్థానంలో ఆష్ట, ద్వితీయస్థానంలో విట్టోలి తండా, బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఆష్ట, ద్వితీయస్థానంలో ఎడ్‌బిడ్ గ్రామ పంచాయతీలు నిలిచాయని తెలిపారు. వీరికి అధికారులు మెమెంటో, కప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఎంఈవో రమణారెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్, పీడీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు ఎంపీడీవో పుష్పలత పతకాలతో పాటు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయికి పలువురు క్రీడాకారులు ఎంపిక అయ్యారని పీడీ దర్శనం దేవేందర్ తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



నర్సాపూర్ (జి) విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : బీజేపీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల క్రియాశీల సభ్యత్వాలని నాయకులతో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, సభ్యత్వ కోఆర్డినేటర్ రాచకొండ సాగర్, కమల్‌నయన్, సామ రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సులను పునరుద్ధరించండి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు కే. రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం బస్ భవన్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. బస్టాండ్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు.

బహిష్కరణను విరమించి ..

ఇందిరమ్మ లబ్దిదారుల గుర్తింపు సర్వేలో పంచాయతీ కార్యదర్శులు

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలనే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గుర్తింపు సర్వేను రెండు రోజులుగా బహిష్కరించిన పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారుల సూచనలతో వెనక్కి తగ్గారు. బుధవారం బహిష్కరణను విరమించి సర్వే విధుల్లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ లబ్దిదారుల గుర్తింపు సర్వే సోమవారం ప్రారంభమయ్యింది. మున్సిపల్ కేంద్రాల్లో వార్డు అధికారులు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు సర్వే చేపట్టాల్సి ఉంది. అయితే పనిభారం తగ్గించడమే కాకుండా తాము దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి డిమాండ్లు నెరవేర్చేంత వరకు సర్వే చేపట్టబోమని పంచాయతీ కార్యదర్శులు వెల్లడించి సంబంధిత విధులను బహిష్కరించారు. దీంతో గత రెండు రోజులుగా జిల్లాలో సర్వే ప్రక్రియ కేవలం మున్సిపల్ కేంద్రాలకే పరిమితమయ్యింది. బుధవారం పంచాయతీ కార్యదర్శులు బహిష్కరణను విరమించి సర్వే విధుల్లో పాల్గొన్నారు. ఈక్రమంలో జిల్లాలోని గ్రామాల స్నీంటిలోనూ ఇందిరమ్మ లబ్దిదారుల గుర్తింపు సర్వే జోరుగా కొనసాగింది. కాగా కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో, మరికొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలతో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాల నమోదు అంతంత మాత్రంగానే కొనసాగినట్లుగా సమాచారం. అవాంతరలన్నీ అధిగమించి గడువులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు గాను జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళికబద్ధమైన పకడ్బందీ చర్యలు చేపడుతోంది.



హస్గుల్‌లో పంచాయతీ కార్యదర్శి సర్వే

ధర్మోరా పంచాయతీ

సెక్రటరీపై చర్యలు తీసుకోవాలి

లోకేశ్వరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ధర్మోరా పంచాయతీ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. ఒక మంచి సంకల్పంతో గత 5 సంవత్సరాల క్రితం ధర్మోరా గ్రామ పంచాయతీకి మా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.35,000లను ఇచ్చామన్నారు. ఆ రూపాయలను ఇప్పటి వరకు ఎలాంటి మంచిపనికి వినియోగించకుండా ఎన్నిసార్లు అడిగినా స్పందించడం లేదన్నారు. ఈ విషయమై లోకేశ్వరం ఎంపీవోకు, ఎంపీడీవో విన్నవించినా వారు కూడా సరిగా స్పందించడం లేదన్నారు. శ్రీధర్‌రెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

'పాత్రికేయులపై దాడి సరికాదు'

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు మోహన్‌బాబు పాత్రికేయులపై దాడి గర్హణీయమని నిర్మల్ జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పేర్కొంది. బుధవారం ఆర్డీవోకు ఇచ్చిన వినతిపత్రంలో దాడిని తీవ్రంగా ఖండించింది.

అలరించిన గ్రీన్ డే వేడుకలు



గ్రీన్ కలర్ డ్రెస్సులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్న చిన్నారులు

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం గ్రీన్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని ప్రీ ప్రైమరి విద్యార్థులు గ్రీన్‌కలర్ దుస్తులను ధరించి చేపట్టిన ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. గ్రీన్ కలర్ కూరగాయాలు, పండ్ల ప్రాముఖ్యత, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులు చిత్రాల ద్వారా ప్రదర్శించి వివరించారు.

విద్యార్థుల ఫుడ్ ఫెస్టివల్ సందడి



బాసర, డిసెంబరు, 11 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలోని హంసవాహిని పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వంటల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. ఫుడ్ ఫెస్టివల్ పేరుతో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వయంగా విద్యార్థులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. తయారు చేయడమేకాదు వడ్డించి విద్యార్థులు తమ వంటల రుచి చూయించారు. మంచి వంటలు తయారు చేసిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులను అందించింది. విద్యార్థులకు అన్ని విషయాల్లో అవగాహన ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఓంకార్ తెలిపారు.

వర్గీకరణ అమలుకు ఉద్యమం బలోపేతం



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉద్యమం బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాలు నిర్ణయించాయి. బుధవారం టీఎన్జీవో సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. సంస్థాగత నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి బుర్ర సతీష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట ప్రభుత్వం వెంటనే అమలులోకి తీసుకురావాలన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదన్నారు. 58 కులాలు ఎస్సీ వర్గీకరణ కోరుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా వర్గీకరణకు మాదిగలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 18 మండలాలకు ఇన్‌చార్జీల నియామకం చేసినట్టు వివరించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

అసంపూర్తిగా వంటగది నిర్మాణం

● గుంజల పాఠశాలలో నాసిరకంగా నిర్మాణ పనులు ● నిధుల వృథాపై స్థానికుల ఆగ్రహం


అసంపూర్తిగా నిర్మించిన వంటగది

భీంపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న సంకల్పంతో అప్పటి ప్రభుత్వం పాఠశాలలకు వంటగది, బాత్ రూంలను మంజూరు చేసింది. టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు అప్పజెప్పారు. అయితే పనులు దక్కించుకున్న గుత్తేదారు నిర్మాణం పనులు చేపట్టి అసంపూర్తిగానే వదిలేశారు. భీంపూర్ మండలంలోని గుంజల గ్రామపాఠశాలకు వంట షెడ్, మరుగుదొడ్లు నిర్మాణానికి టెండర్‌లు పిలిచారు. టెండర్‌లో పనులు దక్కించుకున్న సదురు కాంట్రాక్టర్ నిర్మా ణం పనులను చేపట్టారు. సమారు 21 లక్షల 60 వేల పనులను దక్కించుకున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులను చేపట్టి 17 లక్షల 60 వేల రూపాయలను తీసుకు న్నారు. కానీ పనులు మాత్రం నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి.

● భీం లేకుండానే స్లాబ్

వంటగది నిర్మాణానికి భీంలు వేయాలి కానీ ఈ నిర్మాణ పనులకు ఎలాంటి భీంలు వేయకుండానే స్లాబ్ వేశారు. అంతేగాక దానికి ప్లాస్టరింగ్ చేయలేదు. అసంపూర్తి నిర్మాణంతోనే వదిలిపెట్టారు. అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా నాణ్యత లేని నిర్మాణాలకు కూడా బిల్లులు చేశారని పలువురు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా కూడా ఆ నిర్మాణపు పనులు పూర్తి కాకపోవటం విచారకరం.

● అసంపూర్తిగా మరుగుదొడ్ల రూమ్‌లు

ఈ నిర్మాణం పనుల్లో భాగంగానే మరుగుదొడ్ల రూమ్‌లు నిర్మించారు కానీ నేటికీ అసంపూర్తిగానే దర్శనం ఇస్తున్నాయి. గోడలు నిర్మించి వదిలేశారు. షీట్‌లు బిగిం చలేదు అవి అసంపూర్తిగానే ఉన్నాయి. పాఠశాల చుట్టూరా ప్రహరీ నిర్మించాలి కానీ ఇప్పటికి అవి


అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ పనులకు సంబంధించిన బిల్లులు మాత్రం అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించడంలో అంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈనిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని లేని పక్షం లో అధికారులు తీవ్ర పరిణామాలను ఎదు ర్కొవాల్సి వస్తుందని హెచ్చరి స్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేయవద్దని గ్రామస్తులు కోరుతున్నారు.

● ప్రమాదం సంభవిస్తే బాధ్యులెవరూ ?

ఎలాంటి నాణ్యత లేని నాసిరకంగా నిర్మాణాలు చేపట్ట డంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కాగా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానికు లు పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరగక ముందే ఉన్న తాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

నాసిరకం పనులతో ప్రభుత్వ . ధనం వృథా



నాణ్యత లేని నిర్మాణాలు చేపట్టడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నాణ్యత లేని నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి.. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలి.

● మడావి వినోద్, గుంజల గ్రామం

చిరుత సంచారం.. భయం భయం


చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బోథ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధన్నూర్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు మంగళవారం రాత్రి గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి నాగోరావు సిబ్బందితో కలిసి రాత్రికి రాత్రి చిరుత సంచరిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు చేసి తిరిగి వచ్చా రు. మళ్లీ బుధవారం ఉదయం వెళ్లి చిరుత పాదముద్రలు గుర్తించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల వారికి పలు సూచనలు చేశారు. ఒంటరిగా పొలం పనులకు వెళ్ళ వద్దని ఉదయం 10 గంటలకు వెళ్లాలని సాయంత్రం నాలుగు గంటలలోపు ఇంటికి తిరిగిరా వాలని రైతులకు సూచించారు. చిరుత సంచారం ఆనవాళ్లు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వివరించారు.

పూలతోట... లాభాల బాట

ముథోల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పూల తోటల సాగుపై యువరైతులు దృష్టి సారిస్తున్నారు. సీజన్‌లో మంచి గిరాకీ ఉండడంతో దానిపై ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి పొలంలో తక్కువ పెట్టుబడి తక్కువ నీటితో అధిక లాభాలు ఆర్జించవచ్చనే ఉద్దేశంతో రైతులు ఈ సాగుపై దృష్టి సారిస్తున్నారు. చామంతి, బంతి, తదితర రకాలను సాగు చేస్తూ లాభాలను అర్జిస్తున్నారు. ముథోల్ మం డలంలోని సరస్వతినగర్ శివారులో భైంసా పట్టణానికి చెందిన నితిన్ అనే యువ రైతు ఎంఎ వరకు విద్యనభ్యసించి ఒక పక్క ప్రైవేట్ ఉద్యో గం చేస్తూ మరో పక్క పూలసాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నితిన్ అనే యువ రైతుకు ముథోల్ మండలంలోని సరస్వతినగర్‌లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ఒక ఎకరం వరి మరో ఎకరం బంతి, చామంతి పూలను గత రెండుసంవత్సరాల నుంచి సాగుచేస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి రూ. 5 ఒక మొక్కచొప్పున కొనుగోలు చేసి పూల నారును నాటాడు. సుమారు ఎకరంకు రూ20 వేల పెట్టుబడి పెట్టిసాగు చేయగా నాటిన 90 రోజుల నుంచి పూలఉత్పత్తి మొదలై 5 నెలల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందవచ్చనే ఉద్దేశంతో ప్రతి ఏడాది చామంతి, బంతి పూలతోటను సాగు చేసి సీజ న్‌లో విక్రయిస్తున్నారు. కిలో పూలు రూ. 40 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. 5 నెల్లో 30 నుంచి 35 క్వింటాళ్ల పూలను విక్రయించగా ఎకరాకు రూ.లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని పెట్టుబడి పోను రూ.1.20 లక్షలు లాభం వస్తుందని తెలిపారు.

కొద్దిపాటి మెళకువలతో అధిక దిగుబడి..

● నితిన్, యువ రైతు



నేను ఎంఎ వరకు చదివి ఒక పక్క ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ మరో పక్క పూల సాగుచేస్తున్నాను. కొద్ది పాటి మెలకువలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు. సీజన్‌లో మరీ ఎక్కువ లాభాలు వస్తాయి.

● సీజన్‌లో మంచి గిరాకీ
● ఉపాధి పొందుతున్న యువరైతు

ఆదర్శ రైతు


బంతి పూలతోట

18 నుంచి నాగోబా ఆలయ వార్షికోత్సవం


నాగోబా ఆలయ ప్రాంగణంలో సమావేశమైన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18, 19వ తేదీల్లో ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మూడోవార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయ ప్రాంగణంలో మెస్రం వంశీయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెస్రం చిన్ను పటేల్, మెస్రం నాగనాథ్, మెస్రం ఆనందరావు, మెస్రం వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 60 పత్తి బండ్లు మాత్రమే కొనుగోలు

బోథ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్‌లలో పత్తి నిల్వలు పేరుకుపోయినందున ప్రతిరోజు 60 పత్తి బండ్లను మాత్రమే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు ప్రకటించారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని రోజుకు 60 బండ్లు మాత్రమే తీసుకురావాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారానికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గిరిజన సంక్షేమ కార్యదర్శి శరత్‌తో సమావేశమై పలు సమస్యలు వివరించామన్నారు. గిరిజన ప్రాంత గ్రామాల అనుసంధానం కోసం రోడ్లు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాలలో మౌలికవసతుల కోసం సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్, కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయాలని, సర్వే పూర్తి అయిన అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరి వికాస్ ద్వారా ఆదివాసీ రైతులందరికీ బోర్‌వెల్స్ కరెంట్ మోటార్స్ మంజూరు చేయాలన్నారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్, ఆట వస్తువులు మంజూరు చేయాలని, సీఆర్టీలకు టైమ్ స్కేల్ వేతనం ఇవ్వాలని కోరారు. సీఆర్టీలు, ఏఎన్ఎంలు దినసరి వర్కర్స్ పెండింగ్ వేతనములు విడుదల చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రములు, పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రములు మంజూరు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐటీడీఏలలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, పీసా కో-ఆర్డినేటర్‌ల వేతన ములు విడుదల చేయాలని, పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. కార్యదర్శి శరత్ సానుకూలంగా స్పందించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనవెంట అశ్వ రావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు ఉన్నారన్నారు.

ఉపాధ్యాయుల కొరత

జర దేఖో


టివిటి పాఠశాలలో ఉపాధ్యాయుడు రాక గదిలో ఖాళీగా కూర్చున్న విద్యార్థులు


ఖాళీగా ఉన్న కుర్చీ

బజార్‌హత్నూర్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి) 11: మండల పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కొన్ని నెలలుగా తెలుగు, ఫిజిక్స్, బయోలాజి ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థినులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థినులకు కొన్ని నెలలుగా ఆయా సబ్జెక్టులలో తరగతులు నిర్వహించకపోవడంతో ఆయా సబ్జెక్టులలో వారు పట్టును కోల్పోతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెండునెలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతుంటే ఇప్పటివరకు విద్యార్థులకు తెలుగు, ఫిజిక్స్, బయోలాజి సబ్జెక్టులు బోధించేందుకు ఉపాధ్యాయులు లేకపోవడం, కొత్త వారిని నియమించకపోవడంతో పాఠశాల సిబ్బందికి విద్యార్థులపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో తెలిసిపోతుందని మండలవాసులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వోని ఫోన్‌లో సంప్రదించగా ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. జిల్లా అధికారిని వివరణ కోరగా కొన్ని నెలలుగా ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమేనని త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని ఆమె తెలిపారు.

సారు సెలవు.. బడి బంద్

బోథ్ : మండలంలోని టీవీటీ గిరిజన ఏకోపాధ్యాయ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు సెలవు పెట్టాడు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయుడు లేకపోవడంతో తరగతి గదిలో ఖాళీగా కూర్చున్నారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లడం లేదని సెలవు పెట్టడంతో సంబంధిత ఎస్ఈఆర్‌పీ రామ్ పలుకు కాసేపు పాఠశాలలో ఉండి తర్వాత ఇతర పాఠశాలలను తనిఖీ చేసేందుకు వెళ్లినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై ఎస్‌సీఆర్‌పీని వివరణ కోరగా ఉపాధ్యాయుడు సెలవు పెట్టి వెళ్ళా డని, తాను కాసేపు పాఠశాలలో ఉండి మధ్యాహ్నభోజనాన్ని నిర్వహించాలని చెప్పి ఇతర పాఠశాలలకు తనిఖీ కోసం వెళ్లడం జరిగిందని వివరించారు. ఏది ఏమైనా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉపాధ్యాయుడు రాకపోతే విద్యార్థులకు చదువులు చెప్పే వారే లేకుండా పోతున్నారు.

దత్తజయంతికి ముస్తాబైన సాయిబాబా ఆలయం


దత్త జయంతికి ముస్తాబైన సాయిబాబా ఆలయం ఇదే

నిర్మల్ అర్బన్, డిసెంబరు 11 : నిర్మల్ పట్టణ శివారులోని శ్రీ గండి రామన్న దత్తసాయి ఆలయం దత్త జయంతి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఘనంగా జరిగే జయంతి వేడుకల కోసం సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అఖండ సాయి నామాన్ని ప్రారంభిస్తారు. రెండోరోజైన శనివారం సాయిబాబాకు మంగళ స్నానం, అర్చన ఇతర పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే చివరి రోజైన ఆదివారం దత్త జయంతిని పురస్కరించుకొని ఉదయం ఐదున్నర గంటల నుంచి ప్రత్యేక పూజాకార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే మహా పారాయణ కార్యక్రమానికి సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడి ఆలయంలో దత్త జయంతిని పురస్కరించుకొని సాయి పారాయణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమానికి షిర్డీ నుంచి ప్రత్యేకంగా సాయి పల్లకి, బాబా పాదుకలను తెప్పిస్తున్నారు. గత ఐదేళ్లుగా నిర్విరామంగా సాగుతున్న సాయి పారాయణంలో భక్తులు, ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. గత నాలుగేళ్ళుగా సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్ రెడ్డి తన సొంత నిధులను సైతం వెచ్చించి ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఆలయాన్ని విస్తరించడంతో పాటు భక్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంతో ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దేవాదాయ శాఖ నిధులు 2.25 కోట్లతో పాటు సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సోదరుడు జైపాల్ రెడ్డిలు కలిసి వారి సొంత నిధులతో చావడి, ధుని, నూతన మూర్తులు, కొత్త రథం తయారీ, కాపడం, నందదీప్, గురుస్థాన్, గోశాల నిర్మాణాలతో పాటు ప్రహరీ గోడ నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు.


భైంసాలో చలి మంటలు కాగుతున్న జనాలు

గజ గజ!

● చలి ధాటికి విలవిలలాడిపోతున్న జనాలు
● ఒక రోజు వ్యవధిలో 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల తగ్గుముఖం
● 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
● ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు


రగ్గులు కప్పుకొని పనులకు వెళుతున్న కార్మికులు

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫెయింజల్ తుఫాన్ కారణంగా వారం రోజులుగా తగ్గుముఖం పట్టిన చలి తీవ్రత ఒక్కసారిగా అధికమయింది. రెండు రోజులుగా దినం, రాత్రి అనే తేడా లేకుండా చలి గాలుల తాకిడి పెరిగింది. చలిదాటికి వృద్ధులు, చిన్నారులు విల విలలాడిపోతున్నారు ఇళ్లలో నుంచి బయటికి రావాలంటే జంకుతున్నారు. తప్పనిసరి ఇంటి నుంచి బయటకు వెలుతున్న వారు రక్షణ చర్య లు చేపట్టనిదే అరుబయట కాలు పెట్టడం లేదం టే పరిస్థితి ఎంత వరకు చేరిందో చెప్పకుండానే తెలిసిపోతోంది.

● అధికమైన చలి తీవ్రత

రెండు రోజులుగా రాత్రి వేళలో చలి తీవ్రత పెరిగింది. ఒకరోజు వ్యవధిలో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ తగ్గిపోయాయి. మంగళవారం దినం వేళలో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 30 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యాయి. బుధవారం నాటి ఉష్ణోగ్రతల నమోదులో చాలా తేడాలు చోటుచేసుకున్నాయి. దినం వేళలో 28 డిగ్రీల సెల్సియస్, రాత్రి వేళలో 10 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఒక రోజుల వ్యవధిలోనే రాత్రి పూట ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ తగ్గదల చోటు చేసుకుంది. రానున్న మూడురోజులు రాత్రి ఉష్ణోగ్రతలు ఇదే రీతిలో కొనసాగనున్నాయని వాతవరణ శాఖ పేర్కొం టోంది.

● వణుకుతున్న జనాలు

చలి బెడద అధికమవడంతో జనాలు రక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. చలి దాటికి సాయంత్రం 6 గంటలు అయిందంటే ఇళ్ల తలుపులు మూసుకుంటున్నాయి. మళ్లీ ఉదయం 8 గంటలు అయితే గాని ఇళ్ల తలుపులు తెరుచుకోవడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లే వారు స్వెట్టర్లు, మంకి క్యాపుల,శాలువలను కప్పు కొని వెలుతున్నారు. పాలు, కూరగాయల విక్రయదారులు, వీధి వ్యాపారులు, బస్సులు, ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు, పేపర్ బాయ్స్ చలితో విలవిలలాడిపోతున్నారు. వివిధ పనులు, అవసరాల రీత్యా తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారి పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయి. శివరాత్రి పర్వదినం ముగిసే వరకు చలితీవ్రత కొనసాగనుందని తెలుస్తోంది.

● ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

చలి గాలుల బెడద అధికమైన నేపథ్యంలో ప్రజలు అధికంగా ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. ప్రతియేటా చలికాలంలో జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో రోడ్డుమార్గాల్లో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలు వెలుస్తుంటాయి. ఈ యేడు కూడా నేపాల్ దేశస్తులతో పాటు ఇతర ప్రాంతాలవాసులు జిల్లాలో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే పక్షం రోజులుగా అంతంత మాత్రంగానే గిరాకీ ఉండటంతో సంబంధిత విక్రయ కేంద్రాలో కొనుగోళ్లు లేక వెలవెలబోయి కనిపించాయి. రెండు రోజులుగా చలి తీవ్రత అధికమైన నేపథ్యంలో ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలు కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. స్వటర్లు, మంకి క్యాపులు, శాలువాలు , చేతి గ్లౌజులు, జర్కిన్లు, రగ్గులు, మఫ్లర్ల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

● జాగ్రత్తలు తీసుకోవాలి..

డా.కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి , భైంసా

చలి గాలుల తీవ్రత పెరుగుతున్నందున ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భి ణుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. అస్తమా. చర్మ వ్యాధిగ్రస్తులు,కీళ్ల నొప్పులు ఉన్నవారు, బాలింతలు స్వెటర్లు, చేతులకు గ్లౌజులు ధరించడం మంచిది.

జిల్లాలో గత 11 రోజులుగా నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

తేది	గరిష్టం	కనిష్టం
01	28	22
02	29	22
03	28	22
04	29	22
05	31	22
06	30	22
07	30	23
08	28	22
09	29	22
10	30	20
11	28	10

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.8 | కనిష్ఠం 13.6

నిర్మల్ జిల్లా వార్తలు



గురువారం 12 డిసెంబరు 2024



కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం(ఫైల్)

గడువు మీద గడువు

- సీఎంఆర్ బియ్యం చెల్లింపునకు మరో మూడు రోజులు మాత్రమే
- బియ్యం చెల్లింపు కోసం రైస్‌మిల్లర్ల కొత్త ఎత్తుగడలు
- ఖరీఫ్, రబీలదీ అదే పరిస్థితి
- కఠిన చర్యలు లేక మిల్లర్లలో కనిపించని మార్పు
- టెండర్ ధాన్యంపై సందిగ్ధత
- జిల్లాలో కాంట్రాక్టర్‌లు, మిల్లర్ల మధ్య కుదరని సయోధ్య

నిర్మల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ వ్యవహారం ఓ ప్రహసనంగా సాగుతోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం సీఎంఆర్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం మిల్లర్లకు వరంగా మారుతోందని అంటున్నారు. 2023-2024 సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ బియ్యం విషయంలో రైస్‌మిల్లర్లు దాటవేత వైఖరిని అవలంభిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ సీజన్‌లకు సంబందించిన బియ్యం చెల్లింపులపై ఇప్పటికే ప్రభుత్వం చాలాసార్లు గడువును విధించింది. అయినప్పటికీ గడువులోగా రైస్‌మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. ప్రభుత్వం జరిమానాలు విధించడమే కాకుండా హెచ్చరికలు సైతం జారీ చేసినప్పటికి మిల్లర్లు ఆ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ వచ్చారు. ఇప్పటికే చాలాసార్లు గడువును పెంచిన ప్రభుత్వం మరోసారి ఈ నెల 15 లోగా 2023-2024 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని చెల్లించాలంటూ ఆదేశించింది. దీంతో మరో మూడు రోజులు మాత్రమే సీఎంఆర్ చెల్లింపుకు గడువు ఉండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ గడువులోగానైనా మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని చెల్లిస్తారోలేదోనన్న అంశమే ప్రస్తుతం చర్చకు తావిస్తోంది. ఇదిలా ఉండగా ఓ వైపు టెండర్‌లలో ధాన్యంను దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు ధాన్యానికి బదులుగా డబ్బులు చెల్లించాలంటూ రైస్‌మిల్లర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టర్ క్వింటాల్‌కు రూ.1840 ధర చెల్లిస్తానని అంగీకరించినప్పటికీ తనకు రూ. 2200 ధరను చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారమంతా అంతర్గతంగా జరుగుతుండడంతో అధికారులు సైతం చర్యలు తీసుకోలేకపోతున్నారంటున్నారు. మొత్తానికి 2022 నుంచి ఇప్పటి వరకు ప్రతిఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలో రైస్‌మిల్లుల యాజమాన్యాలు సిండికేట్ అవతారమెత్తి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం గడువులు విధిస్తున్నప్పటికీ ఆ గడువులను ధిక్కరిస్తూ రైస్‌మిల్లర్లు మొండిగా వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కఠినచర్యలు తీసుకునేందుకు వెనకాడుతుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరో మూడు రోజులు మాత్రమే గడువు

2023-2024 ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కోసం 1,42,759 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు కేటాయించారు. దీని ప్రకారం 95,942 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ పేరిట రైస్‌మిల్లులు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 79,326 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే రైస్‌మిల్లర్లు సర్కారుకు అప్పగించారు. ఇంకా 16,616 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. గడువు మూడురోజులే ఉండడంతో అంత మొత్తం బియ్యాన్ని రైస్‌మిల్లర్లు సర్కారుకు ఇస్తారో లేదోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే 2023-2024 రబీ సీజన్‌కు సంబంధించి 1,56,847 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్‌మిల్లర్లకు కేటాయించారు. అయితే 1,05,697 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 15,607 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే సర్కారుకు ఇచ్చారు. ఇంకా 90,090 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాల్సి ఉంది.

టెండర్ ధాన్యంపై సందిగ్ధత..

కాగా ప్రభుత్వం జిల్లాలో 1,49,294 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి టెండర్ పిలిచింది. అయితే ఈ ధాన్యమంతా ఇప్పటికి రైస్‌మిల్లర్ల వద్దనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. టెండర్‌లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు కేవలం 8975 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే లిఫ్ట్ చేశారు. ఇంకా 1,40,319 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లిఫ్ట్ చేయాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారంలో వస్తున్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించకపోతుండడం సమస్యగా మారుతోంది.

కాంట్రాక్టర్‌లు, మిల్లర్ల మధ్య కుదరని సయోధ్య.

ఇదిలా ఉండగా టెండర్ ద్వారా ధాన్యాన్ని దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు, రైస్‌మిల్లర్ల మధ్య సయోధ్య కుదరకపోవడం సమస్యగా మారుతోందని అంటున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ధాన్యంకు బదులు డబ్బులు చెల్లించాలని రైస్‌మిల్లు యజమానులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా కాంట్రాక్టర్‌లు క్వింటాల్‌కు రూ. 1840 ధర చెల్లిస్తామని అంగీకరించగా ఈ ధర విషయంలో బేధాభిప్రాయాలు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం అటు సంబంధిత శాఖలోనూ రైస్‌మిల్లర్ల మధ్య చిలికి చిలికి గాలివాన లాగా మారే అవకాశం ఉందని అంటున్నారు.

భగవద్గీత సామూహిక పారాయణం



గీతాజయంతి నిర్వహిస్తున్న పాఠశాల నిర్వాహకులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత శ్లోకాలను బుధవారం సామూహికంగా విజయ స్కూల్ విద్యార్థులు 120 మంది పారాయణం చేశారు. గీతాజయంతి హైందవి ఫౌండేషన్, విజయ స్కూల్ కలిసి గీతా జయంతి నిర్వహించింది. కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం మాట్లాడుతూ... భగవద్గీత మతగ్రంథం కాదని అన్నారు. శ్రీకృష్ణుడు ఐదు వేల ఏళ్ల క్రితం వేదజ్ఞానం సారాంశాన్ని అర్జునుడికి బోధించాడన్నారు. గీతా సారాంశాన్ని జీవితానికి అన్వయించుకొని ఆచరించాలన్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఈసీ మెంబర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరులో ఘనంగా గీతా జయంతి



భగవద్గీతలతో కళాశాల విద్యార్థులు

కుంటాల, డిసెంబరు, 11: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు గీతా శ్లోకాలను ఆలపించారు. కురుక్షేత్ర యుద్ధ సన్నివేశాన్ని ఏర్పాటు చేసి శ్రీ కృష్ణుడు ఉపదేశించిన గీతా సారాన్ని ఈ సందర్భంగా విద్యార్థులు నాటక రూపంలో వివరించారు. కళాశాల యాజమాన్యం జానకిరామ్ తండ్రి నారాయణరావు పటేల్ జ్ఞాపకార్థం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌లు సాయిలు, శ్రీనివాస్, సిబ్బంది హరిప్రసాద్, విద్యార్థులు అధ్యాపకులు ఉన్నారు.

యజ్ఞశాల నిర్మాణానికి విరాళం



యజ్ఞశాలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కుంటాల, డిసెంబరు, 11: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు దత్తవెంకట సాయి మందిరంలో నిజామాబాద్‌కు చెందిన దేవేందర్‌గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు యజ్ఞశాల నిర్మించారు. దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం యజ్ఞశాలను ఆయన కుమారులు పాల్థ సంతోష్, పాల్థ శ్రీనివాస్ ప్రారంభించారు. వారి తండ్రి జ్ఞాపకార్థం ఈ యజ్ఞశాల నిర్మించి ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

ఆశా కార్యకర్తలపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

- భైంసా ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ హయంలో ఆశా కార్యకర్తలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు వారి సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తోందని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ ధ్వజమెత్తారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో డైరెక్టర్ దత్తురామ్ పాటిల్‌తో కలిసి మాట్లాడారు. ఆశా కార్యకర్తలను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ రాజకీయం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాధరణతో బెంబేలెత్తిపోతున్న బీఆర్ఎస్ పార్టీ ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజాపాలన విజయోత్సవాలకు అన్ని ప్రాంతాల్లో అపూర్వ స్పందన లభించిన నేపథ్యంలో ఖంగుతిన్న గులాబీ దండు సత్యదూరమైన ఆరోపణలకు దిగుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ దశాబ్ద కాలపు పాలనలో వేతనాల పెంపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆశా కార్యకర్తలు ఎన్నో మార్లు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేపట్టిన పట్టించుకోని వాళ్లు ఇపుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని వ్యంగాస్త్రాలు విసిరారు. 2015 సంవత్సరంలో ఆశా కార్యకర్తలు ఏకంగా 106 రోజుల పాటు ఆందోళనలు చేపట్టారని గుర్తు చేశారు. 2018,2020,2021,2023 సంవత్సరాలలోనూ సమ్మెలు, ధర్నాలు, నిరసనలకు దిగారని వివరించారు. అన్ని పర్యాయాలు ఆశా కార్యకర్తలు ఆందోళనలకు కారణ రూపులైన బీఆర్ఎస్ ఇప్పుడు వారి గూర్చి మాట్లాడం హస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందనతోనే ఉందన్నారు. ఆశాలు సంయమనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు

ఎంపికైన ఆర్జీయూకేటీ విద్యార్థిని



విద్యార్థినికి స్కాలర్‌షిప్ పత్రాలను అందజేస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, డిసెంబరు, 11 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ విద్యార్థిని కాటేపల్లి మీనాక్షి రెండు ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్ పథకాలకు ఎంపికైనట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. మీనాక్షికి ఎల్ఐసీ - గోల్డెన్‌జుబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023 -24 లభించింది. దీని ద్వారా స్పెషల్ గర్ల్ స్కాలర్ కేటగిరి కింద ఆమె కోర్సు మొత్తం కాలానికి రూ. 15,000 దీంతో పాటు టాటా క్యాపిటర్ పంఖ్ స్కాలర్‌షిప్‌కు కూడా ఎంపికైంది. ఈ స్కాలర్‌షిప్‌లో భాగంగా టాటా గ్రూప్ ఆమెకు రూ.12 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. మీనాక్షి సాధించిన విజయాలను చూసి మేము చాలా గర్విస్తున్నాము. ఆమె విద్యా విషయక కార్యక్రమాలలో విజయాన్ని కొనసాగించాలని కోరుకుంటూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేటెడ్ డాక్టర్ విట్టల్, డా.చంద్రశేఖర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో 108 అంబులెన్స్ సర్వీస్ ప్రారంభం



సోన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో నిర్మల్ డీసీసీ ప్రెసిడెంట్ కూచాడి శ్రీహరిరావు కృషితో రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోన్ పీహెచ్‌సీలో 108 అంబు లెన్స్ సర్వీస్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహినుద్దీన్, రాజనరసింహరెడ్డి, జి.లింగన్న, ప్రసాద్, లింగన్న, దాస్, రాజేశ్వర్, ప్రేమ్, అజహర్, సాయి, ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్- 2 నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 15, 16న నిర్వహించే గ్రూప్- 2 పరీక్షకు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా చూడాలన్నారు. 8080 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, 24 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. టీఎస్పీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సీసీ కెమెరాలు, పటిష్ఠ పోలీసు బందోబస్తు తదితర అంశాలపై మార్గదర్శనం చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతే లోనికి పంపాలన్నారు. పలు అంశాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. రీజినల్ కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు, రూట్ అధికారులు, శిక్షణలో పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి జైలు శిక్ష

- నాటు సారా తయారీ, విక్రయం కేసుల్లో ఏడుగురి బైండోవర్



కడెం తహసీల్దార్ ఎదుట నిందితులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుడుంబా విక్రయం కేసులో బైండోవర్‌ను ఉల్లంఘించిన కేసులో ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అభిషేక్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఎక్సైజ్ ఎస్సై అభిషేక్ తెలిపిన కథనం ప్రకారం... కడెంకు చెందిన బసగుంట గంగాధర్ అనే వ్యక్తి గుడుంబా విక్రయిస్తూ పట్టుబడడంతో ఎక్సైజ్ అధికారులు గంగాధర్‌ను గతంలో కడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ బైండోవర్ నిబంధన మేరకు తిరిగి అదే తప్పిదాన్ని చేస్తూ పట్టుబడితే రూ. 1 లక్ష జరిమానా లేదా సంవత్సరం కాలానికి జైలు శిక్ష ఉంటుందని అభిషేక్ తెలిపారు. కాగా బైండోవర్‌ను ఉల్లంఘించిన గంగాధర్ నాటు సారా అమ్ముతూ బుధవారం ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు. గంగాధర్‌ను కడెం తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా బైండోవర్ ఉల్లంఘించిన నేరం కింద ఆదిలాబాద్ జైలుకు పంపినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా తదితర కేసుల్లో మరో ఏడుగురిని కడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కడెం మండలంలో నిర్వహించిన దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, ఇర్ఫాన్, హరీష్, నిరోష, తదితరులు పాల్గొన్నారు.

మరదలిపై కత్తితో దాడి చేసిన వదిన

- ఆసుపత్రికి బాధితురాలి తరలింపు • సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ • నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



దాడిలో గాయపడిన రీచా



మారు వేషంలో కత్తితో మరదలిపై దాడి చేసిన నిందితురాలు

ముథోల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలో బుధవారం కత్తితో దాడి కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం... ముథోల్ మండల కేంద్రంలోని సాయి మాధవ్‌నగర్‌లో ఓ ఇంట్లో ఎస్‌బీఐ ఉద్యోగి హనుమంత్‌రావు కుటుంబం అద్దెకు ఉంటున్నారు. అయితే హనుమంత్‌రావు భార్య అశ్విని డెలివరీ కోసం సుమారు మూడు నెలల క్రితం భైంసాలోని తమ అమ్మవారి ఇంటికి వెళ్లి అక్కడే ఉంటుంది. అయితే బుధవారం మధ్యాహ్నం అశ్విని మారువేషంలో ముథోల్‌లోని అద్దెకు ఉంటున్న ఇంటికి చేరుకొని హనుమంత్‌రావు సొదరీ అయిన రీచాపై కత్తితో దాడి చేసింది. దీంతో బాధితురాలు కేకలు వేయడంతో గల్లీ వాసులు, స్థానికులు అక్కడికి చేరుకొని ఆపే ప్రయత్నం చేయగా ఆమె అక్కడి నుంచి వెళ్లిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ముథోల్ సీఐ మల్లేష్ సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన బాధితురాలిని చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి గల పూర్తి కారణాలను విచారిస్తున్నామని తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

సమాజ సేవకుడికి భారత్ సేవ్ పురస్కార్

కుబీర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుబీర్‌కు చెందిన సమాజ సేవకుడు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డాక్టర్ సాప పండరికి భారత్ సేవ్ పురస్కార్ అవార్డు దక్కింది. 75వ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

గ్రామాల్లో మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే

- డీఎంహెచ్‌వో రాజేందర్



డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 18 గ్రామాల్లో మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో రాజేందర్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో 18 గ్రామాల్లో ఈ సర్వే ఉం టుందన్నారు. వ్యాధిగ్రస్తులను గు ర్తించి చికిత్స అందించడంతో వ్యాధి వ్యాప్తి అరికట్టవచ్చునని తెలిపారు. వ్యాధిగ్రస్తుల్లో శారీరక వైకల్యం రాకుండా చూడ వచ్చునని పేర్కొన్నారు. గాజులపేట, మంజులాపూర్, వడ్యాల్, పొన్కల్, కొరిటికల్, బాదనకుర్తి, కుంటాల, దిలావర్‌పూర్, లోకేశ్వరం, తిమ్మాపూర్, లింగాపూర్, దస్తురాబాద్, కామోల్, ఎడ్‌బిడ్, రాహుల్ నగర్, కుబీర్, చించోలి, బోసి, తదితర హై రిస్క్ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మనుబోతు మృతి



మృతి చెందిన మనుబోతు.. దెబ్బతిన్న కారు ముందు భాగం

దిలావర్‌పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ - న్యూ లోలం మధ్య కాల్వ అడవుల్లో 61వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మనుబోతు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం మధ్యాహ్నం ప్రముఖ వైద్యుడు భైంసా నుంచి నిర్మల్ కారులో వెళ్తుండగా కాల్వ అడవుల్లో నుంచి మనుబోతు వేగంగా రోడ్డును దాటే ప్రయత్నంలో కారును ఢీ కొట్టింది. కారు ముందు భాగంగా దెబ్బతినగా మనుబోతు అక్కడికక్కడే మృత్యువాత పడింది. వైద్యుడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. కాగా స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్‌బీవో మీనా పశు వైద్యాధికారికి సమాచారం ఇచ్చి పోస్టు మార్టం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భైంసా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని భైంసా ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణ పరిధిలోని ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమీన్‌గల్లీ, ఏక్‌మినార్ ఏరియా, మదీనా కాలనీ, నిర్మల్ రోడ్డు మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లుగా వివరించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో అధికారులు విజ్ఞప్తి చేశారు.

వసతిగృహాల్లో

నాణ్యమైన భోజనం అందించాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీజీవీపీ డిమాండ్ చేసింది. బుధవారం నూతన బాధ్యతలు చేపట్టిన బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే. ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డిని బీజేపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రకరణ్ రెడ్డి ఏఎస్పీని సన్మానించారు.